

ప్రాణాపాయ స్థితిలో వైద్యురాలు


హర్షవర్ధన్

ఆసిఫాబాద్, మార్చి 28: తిర్యాణి మండల కేంద్రంలోని ప్రభుత్వఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్న హర్షవర్ధన్ ప్రేమించి మోసం చేసిన వైద్యురాలు ప్రియాంక ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. పవిత్రమైన వైద్యవృత్తిలో ఉంటూ అక్కడే పనిచేస్తున్న ఇద్దరు లేడీడాక్టర్లతో ఒకరికి తెలియకుండా మరొకరితో ప్రేమాయణం కొన సాగించాడు డాక్టర్ హర్షవర్ధన్. పెండ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఇటీవల ప్రియాంక జైనూరు మండలానికి మరొక వైద్యురాలు మంచిర్యాలకు బదిలీ అయింది. జైనూరుకు బదిలీపై వెళ్లిన ప్రియాంకను హర్షవర్ధన్ దూరం పెట్టాడు. మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న వైద్యురాలితో సన్నిహితంగా ఉంటూ పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రియాంక హర్షవర్ధన్‌ను నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తన గురించి చెడుగా మాట్లాడంతో పాటు పెళ్లికి తిరస్కరించాడు. దీంతో ప్రియాంక మనస్థాపానికి గురై తల్లిదండ్రులకు ఫోన్‌చేసి విషయాన్ని వివరించింది. వారు ఆమెను స్వగ్రామమైన మంచిర్యాల జిల్లా కాసిపేటకు తీసుకువెళ్లారు. తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె బాత్‌రూమ్ క్లీన్‌చేసే(హార్పిక్) రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితివిషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు.

వార సంతలో సౌకర్యాలు కల్పించాలి


వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, మార్చి 28: మండలకేంద్రంలో ప్రతి గురువారం జరిగే వారసంతలో సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్‌యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ కార్యదర్శి శివకుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం జరిగే వారసంతలో కనీస వసతులు లేకవ్యాపారులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వారసంతలో షెడ్లు లేకపోవడంవల్ల ఎండలో నిలబడి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. వర్షాకాలంలో నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సదుపాయాలు కల్పించాలని కోరారు.

విద్యార్థులకు జ్యూస్ పంపిణీ

పెంచికలపేట, మార్చి 28: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు జాగృతిఅధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్యూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, యువకులు ప్రవీణ్, అనీల్ పాల్గొన్నారు.

పత్తి రైతులపై విత్తన భారం



- గతేడాది కంటే ఒక్కోప్యాకెట్‌పై రూ.11 పెరుగుదల
- జిల్లాలో రైతులపై రూ.కోటిపైనే భారం
- 3.5లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- 7లక్షల పైనే విత్తన ప్యాకెట్లు అవసరం

చింతలమానేపల్లి, మార్చి 28: పత్తి విత్తనాల ధరలు ప్రతీ ఏటా కొంత పెరుగుతుండడంతో రైతులకు భారం తప్పడం లేదు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.11 పెరి గింది. దీంతో జిల్లాలో రైతులపై రూ.కోటిపైనే భారం పడనుంది. జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పత్తి పంట ఒకటి. వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ధరను నిర్ణయించింది. అయితే ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరుగడంతో ఇప్పటికే ఖర్చులు విప రీతంగా ఉన్నాయని రైతులు పేర్కొంటుండగా పత్తి విత్తనాల పెరుగుదల గుదిబండగా మారిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

● జిల్లాలో 3.5లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 15మండలాల పరిధిలో ప్రధానపంటగా పత్తిని సాగు చేస్తుండగా అత్యధికంగా గతేడాది జిల్లా వ్యాప్తంగా 3.4లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది సైతం సుమారుగా 3.5లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉంది. దీంతో ఎకరాకు 2ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉన్నా 7లక్షలపైనే పత్తి విత్తనప్యాకెట్లు అవసరం అవుతాయి.

గతేడాది ఒక్కో పత్తివిత్తన ప్యాకెట్ ధర రూ. 853 ఉండగా, ఈ ఏడాది ఒక్కోప్యాకెటుకు రూ.11 పెంచడంతో రూ.864కు చేరింది. జిల్లా మొత్తంగా కోటి పైనే రైతులకు భారం పడనుంది. పత్తి విత్తనాలకు రైతులు ప్రైవేటు కంపెనీల పైనే ఆధారపడుతున్నారు. మార్కెట్‌లో బీటీ-1, బీటీ-2 రకాలు అందుబాటులో ఉన్నా, ఎక్కువ మొత్తంలో బీటీ-2 రకం పత్తి విత్తనాలనే వాడుతుంటారు. సీజన్ ప్రారంభం అయిందంటే అనేక కంపెనీలు వివిధ రకాల పేర్లతో మార్కెట్లకు విత్తనాలను విడుదల చేస్తాయి.

● రెండు, మూడు కంపెనీలకే డిమాండ్..

మార్కెట్లో వందల రకాల విత్తన కంపెనీలు ఉంటున్నా రెండు, మూడు కంపెనీలకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఒక్కో పత్తి ప్యాకెట్ ధర ఈ ఏడాది రూ.864 ఉండగా, ప్రభుత్వం ప్రకటించిన ధరకే డీలర్లు రైతులకు ఇస్తారు. డిమాండ్ ఉన్న పత్తిప్యాకెట్లకు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా విక్రయించే అవకాశం ఉంది. డిమాండ్ ఎక్కువ ఉన్న పత్తి విత్తనాలు కావాలని రైతులు డీలర్ల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి. గతేడాది సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

కొందరు డీలర్లు ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే ఎక్కువ ధరకు అమ్మి రైతులను నట్టేట ముంచారు. అయితే ఇలాంటి పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతు న్నారు. ఇప్పటికే వ్యవసాయంలో ఖర్చులు ఏటేటా పెరిగిపోతుండగా ఈ ఖర్చు మరింత భారం కానుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

వాంకిడి, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీచేయాలని డీఎస్పీ సదయ్య సిబ్బందికి సూచించారు. గురువారం వాంకిడి ఎస్సై సాగర్‌తో కలిసి మండలంలో ఏర్పాటుచేసిన ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తనిఖీకేంద్రాలవద్ద చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి నగదు, మద్యం, గంజాయి, ధాన్యం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.


వాంకిడిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 28: గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలతోపాటు సీసీరోడ్లు, ఇంటిపన్నుల వసూలు తదితర పనులను ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు పంచాయతీ అధికారి సురేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్, ఉమర్ హుస్సేన్‌తో పాటు పలువురు ముఖ్య అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీల్లో వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చేతి పంపులు, పంపుసెట్లు, మిషన్ భగీరథ పైపులు ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. లీకేజీ సమస్యలు పరిష్కరించాలన్నారు. నీటిఎద్దడి ఉన్నచోట ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో అన్నిగ్రామాల్లో ఈనెల31 వరకు వంద శాతం ఇంటిపన్నులు వసూలు చేయాలన్నారు. ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలికి వందరోజుల పని కల్పించాలన్నారు. కూలీల హాజరు శాతం పెంచాలన్నారు. అలాగే గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురికి కాలువల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవో, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు అవగాహన కల్పించాలి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై పోలింగ్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. పోలింగ్ రోజున అధికారులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా చూడాలన్నారు. కలెక్టరేట్‌లో పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్లకు ఇచ్చిన శిక్షణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే పీవో, ఏపీవోలు ఇతర పోలింగ్ సిబ్బందికి ప్రతి అంశంపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్లపై ప్రిసైడింగ్ అధికారి, అదనపు ప్రిసైడింగ్ అధికార్లకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. 7-సీడైరీలోని ప్రతిఅంశం తెలియ పర్చడంతోపాటు పోలింగ్ రోజు ఉపయోగించే ప్రతికవర్‌ను పూర్తి సమాచారంతో నింపే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. మాక్‌పోలింగ్ తప్పని సరిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

వేతనం పెంపును కూలీలు సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి: ఉపాధి హామీ కూలీలకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి రోజు వారి వేతనం పెంచుతున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు అధికారి సురేందర్‌తో కలిసి బెండార, వాంకిడి గ్రామాల్లో గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న నీటికుంట నిర్మాణం, కాలువ పూడికతీత పనులను పర్యవేక్షించారు. అర్హత గల ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. రోజు వారి కూలి రూ.300 చొప్పున పెంచుతామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించిన బెండార గ్రామ సెక్రెటరీ నియమాళిక, మండల పంచాయతీ అధికారి ఖాజా అజీజుద్దీన్‌కు షోకాజు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఉపాధి హామీ పనిచేసే కూలీలు వేతనాలు పొందడంలో పోస్టల్ శాఖ పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అకౌంట్లు లాక్ పడి ఉన్నా సరిచేయడం లేదని తెలపగా పోస్టల్‌శాఖతో మాట్లాడి చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, మండల పంచాయతీ అధికారి, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎనోలి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో మంచినీరు, విద్యుత్, రోడ్లు సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో సక్రమంగా నీటిసరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో విద్యుత్, రోడ్లు సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.


వాంకిడిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ

సిర్పూర్(టి), మార్చి 28: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సురేష్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలను ఎస్సై దీకొండ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వెంకట్రావుపేట, హుడ్కిలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను సందర్శించి సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్‌పాషా, ఎస్సై దీకొండ రమేష్ ఉన్నారు.


సిర్పూర్(టి)లో పోలింగ్ కేంద్రం వద్ద ఎస్పీ సురేష్‌కుమార్

చెక్ పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి చెక్ పోస్టును గురువారం ఎస్పీ సురేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సంద్బంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అక్రమమద్యం, డబ్బు, గంజాయి, మాదక ద్రవ్యాలు, ఎన్నికలలో ప్రభావితం చేసే బహుమతులను రవాణా కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో వీడియో తీయాలని సూచించారు. అనంతరం కౌటాల పోలీసుస్టేషన్‌ను సందర్శించి సిబ్బంది విధులను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్‌పాషా, ఎస్సై మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రం సుగుణకు ఎంపీ టికెట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జైనూర్, మార్చి 28: ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఆత్రం సుగుణకు ఇవ్వడం పట్ల జైనూరులో గురువారం కాంగ్రెస్ పార్టీనాయకులు సంబరాలు చేసుకుని మిఠాయిలు పంచారు. రోడ్డుపై పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల్లో ఆత్రం సుగుణ గెలుపునకు అందరూ సమష్టి కృషితో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు అయ్యుబ్‌ఖాన్, సుద్దాల శ్రీనివాస్, సుద్దాల ఆనంద్, అస్లం, దండుగుల మహేష్ పాల్గొన్నారు.

కౌటాలలో 'ఆర్ఎస్పీ గో బ్యాక్' పోస్టర్ల కలకలం

కౌటాల, మార్చి 28: మండలకేంద్రంలో గురువారం వెలిసిన ఆర్ఎస్పీ గోబాక్ పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. ఇటీవల బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమీక్షా సమావేశానికి వస్తుండడంతో మండలకేంద్రంలో బహుజన ద్రోహి ఆర్ఎస్పీ గోబ్యాక్ అంటూ పోస్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేశారు. గతంలో బీఎస్పీలో ఆయనతో పని చేసిన వ్యక్తులే పోస్టర్లు ఏర్పాటు చేసి ఉంటారన్న అను మానాలు వ్యక్తమవుతున్నాయి.



కౌటాలలో ఆర్ఎస్పీకి వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్



కొత్త గనులు ఏర్పాటు చేయండి

- సీఎండీ బలరాంకు వినతిపత్రం అందజేత



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్, మార్చి 28: నిరుద్యోగ యువతకు మేలు జరిగేలా సింగరేణిలో కొత్త గనులు ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ కోరారు. గురువారం ఆయన యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం సీఎండీ బలరాంకు పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని, పెర్క్స్‌పై ఆదాయపు పన్నును రద్దు చేయాలని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించాలని కోరారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, తదితరులను కలిసి సింగరేణి కార్మికుల సమస్యలు వివరించారు. సమావేశంలో 11ఏరియాలకుచెందిన ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి


గని వద్ద సింగరేణి ప్లానింగ్‌అండ్‌ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

మందమర్రిటౌన్, మార్చి 28: ఉద్యోగులు, అధికారులు అనే తేడా లేకుండా అందరూ రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదరహిత ఉత్పత్తి కోసం పాటుపడాలని సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏరియాలోని కేకే 5గని వద్ద విలేకరులతో మాట్లాడారు. కేకే5 గనికి రక్షణలో, ఉత్పత్తిలో మంచి రికార్డులు ఉన్నాయని, ఈ రికార్డులను కొన సాగించాలన్నారు. ప్రతి రోజు పనిస్థలాల వద్ద రక్షణ చర్యలను పర్యవేక్షించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈ గనికి నిర్దేశించిన లక్ష్యాన్ని ఇప్పటికే వందశాతం సాధిం చడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం గనికి సంబంధించిన ప్లాన్‌లను పరిశీలించి పలుసూచనలు చేశారు. సాయంత్రం గనిలోకి దిగి పనిస్థలాలను పర్యవేక్షించారు. ఆయనవెంట జీఎం మనోహర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, శాంతిఖని గ్రూపు ఏజెంటు విజయ్‌ప్రసాద్, గని రక్షణాధికారి రమేష్ ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీని ఆయన సందర్శించారు. మట్టి పనులను, ఓసీపీ ప్లాన్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యానికి ఇంకా మూడు రోజుల సమయం ఉన్నందున లక్ష్యసాధన చేరుకునేందుకు ప్రణాళికలతో పనిచేయాలన్నారు. ప్రమాద రహిత ఉత్పత్తికి మొదటిప్రాధాన్యత ఇవ్వాలని, రక్షణసూత్రాలు పాటిస్తూ పనులను చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి ఓసీపీలోని ఓబీపనులను పరిశీలించారు. ఆయన వెంట జీఎం మనోహర్, కేకే ఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, డీవైఎస్ఎస్‌వో ప్రకాష్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు ప్రమోషన్ల లెటర్లు అందించాలి

శ్రీరాంపూర్, మార్చి 28: సింగరేణి యాజమాన్యం కార్మికులను కేటగిరీ ప్రమోషన్ లెటర్లు అందించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానికంగా మాట్లాడారు. 2022-23ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేటగిరీ పదోన్నతులు 2023 సెప్టెంబర్ నాటికి ఇవ్వాల్సి ఉండగా, ఆలస్యం చేశారన్నారు. వాటిపై తమ యూనియన్ పోరాడి సాధించిందని, లెటర్లు సిద్ధమైన తరువాత కొన్ని యూనియన్ల రాజకీయ అవసరాల కోసం వాటినిసంస్థ ఇంకా ఆలస్యం చేయాలని చూస్తోందన్నారు. వెంటనే ప్రమోషన్ లెటర్లు కార్మికులకు అందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు కిషన్ రావు, బ్రాంచ్‌సంయుక్త కార్యదర్శి చంద్ర మోహన్, బద్రిబుచ్చయ్య, ప్రసాద్‌రెడ్డి, నర్సింగరావు, లచ్చయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

- డీఎస్పీ సదయ్య


కెరమెరిలో కవాతు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ బలగాలు

కెరమెరి, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని డీఎస్పీ సదయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలో సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ విధిగా తమ ఓటుహక్కు వినియో గించుకోవాలని ఆయన సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంగించినట్లయితే చర్యలు తప్పవన్నారు. అనుమానిత వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో అగ్నిప్రమాదాలకు టోల్‌ఫ్రీ నెంబర్

సిర్పూర్(టి), మార్చి 28: అడవిలో ఏర్పడే అగ్ని ప్రమాదాల సమాచారం అటవీఅధికారులకు అందించ డానికి టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ ఒక ప్రకటనలో తెలి పారు. అడవుల్లో మంటలు చెలరేగినట్లు తెలిస్తే వెంటనే 18004255364 లేదా 9803338666 నెంబర్లకు కాల్ చేయాలన్నారు. ఈ నంబర్లు 24గంటలు అందుబాటులో ఉంటాయన్నారు.

మల్లన్న పట్నాల జాతర ప్రారంభం

దండేపల్లి, మార్చి 28 : దండేపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో మాల గాని మల్లన్న స్వామి కల్యాణం, పట్నాలను గురువారం ప్రారంభించారు. యాదవ సంఘం నాయకుడు గొట్ల భూమన్న, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు అల్లంల కుమారస్వామి, పెద్ద గొల్ల నానవేని రాజన్న మాట్లాడుతూ, ఐదేళ్లకోసారి పట్నాలు నిర్వహిస్తామని, జోగెత్త కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగిస్తామని చెప్పారు. ఆదివారం స్వామివారిని గంగ స్నానానికి తీసుకెళ్లి సోమవారం పట్నాలతో కార్యక్ర మాన్ని ముగిస్తామని వివరించారు.

పంటలను పరిశీలించిన నాయకులు

జన్నారం, మార్చి 28: మండలంలోని తిమ్మాపూర్‌లో నష్టపోయిన పంటలను గురువారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్ పరిశీలించారు. వర్షాలకు 70ఎకరాల్లో పంటలు దెబ్బతి న్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యంవల్లనే నీరులేక పంటలు ఎండిపోతు న్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుం దన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. జడ్పీటీసీ చంద్రశేఖర్, నాయకులు మున్వర్‌ఆలీ, భరత్ కుమార్, గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న జాన్సన్ నాయక్

పోస్టాఫీసును సందర్శించిన విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 28: బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కామర్స్ విద్యార్థులు గురువారం పట్టణంలోని పోస్టాఫీసును సందర్శించినట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోస్టాఫీసులో నిర్వహించే విధులు, బీమా, తదితర పథకాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా పోస్టుమాస్టర్ వెంకన్న, సీనియర్ పోస్టల్ అసిస్టెంట్ సంతోష్ విద్యార్థులు పోస్టాఫీసు విధులు, సేవల గురించి వివరిం చారు. కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మేడ తిరుపతి, కాంపల్లి శంకర్, అధ్యాపకులు రవి, కిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టాఫీసు వద్ద డిగ్రీ విద్యార్థులు

గోడ గడియారాలు, మద్యం పట్టివేత

మందమర్రిటౌన్, మార్చి 28: పట్టణంలోని నాగార్జున కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బి. అశోక్ నివాసంలో గురువారం చెన్నూరు నియోజకవర్గ ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేసి 32 గోడ గడియారాలు, 132 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. పక్కా సమాచారం మేరకు తనిఖీలు చేసి మద్యం, గడియారాలను పట్టుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అచ్యుత్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. రెండో జోన్‌లోని బీఆర్ఎస్ కార్యకర్త నివాసంలో 75 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

తాండూర్, మార్చి 28: అచ్చలాపూర్‌లో తప్పిపోయిన బాలుడిని గురువారం పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రాజేష్ కుమార్ దంపతులు కూలీ కోసం అచ్చలాపూర్ గ్రామానికి వచ్చారు. వీరికి ఇద్దరు కుమారులు. రెండు సంవత్సరాల వయస్సు గల సుశాంత్‌కుమార్‌ను రోజు పని స్థలం వద్దకు తీసుకువెళ్ళే వారు. గురువారం తల్లిదండ్రులు పనిలో ఉండగా బాలుడు రోడ్డుపైకి వచ్చాడు. అచ్చలాపూర్ గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు గమనించి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న వేద పండితులు

జన్నారం, మార్చి 28: మండలంలోని రేణిగుంటలో గురువారం సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు రామామందాచార్యుల స్వామి, శ్రీధర్ ఆచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఖానాపూర్ బీజేపీ నాయకుడు రితీష్‌రాథోడ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గణిత రంగోలి



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

మందమర్రిరూరల్, మార్చి 28: మండలంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం గణిత రంగోళి కార్యక్రమాన్ని నిర్వహించారు. 6 నుంచి 9వ తరగతి వరకు గణిత సూత్రాలు, గుర్తులతో రంగోళి వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయ కృష్ణ మాట్లాడుతూ గణితం కష్టంగా ఉన్నప్పటికీ అర్థమైతే చాలా సులువుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు అమీర్‌పాషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత, హద్దురాళ్ల తొలగింపు





నస్పూర్, శ్రీరాంపూర్‌లో అక్రమ కట్టడాలను కూల్చి వేస్తున్న అధికారులు

నస్పూర్, మార్చి 28 : నస్పూర్ మున్సిపాలిటీలో అనుమతులు లేని, నిబంధనలు పాటించని కట్టడాలను గురువారం టాస్క్‌ఫోర్స్ బృందం కూల్చివేసింది. కలెక్టరేట్ సమీపంలో ఓ వెంచర్‌లో సెట్‌బ్యాక్ పాటించ కుండా నిర్మిస్తున్న నాలుగు కట్టడాల ముందు భాగాన్ని ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. సెట్‌బ్యాక్ వదిలి నిర్మాణాలు చేయాలని సూచించారు. గృహ నిర్మాణాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. విలేజ్ నస్పూర్ రోడ్డులో సర్వే నంబరు 42లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్న ఇంటి పిల్లర్లను, పునాదులను తొలగించారు. అసైన్డ్ భూమిలో అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు తొలగించామని తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్‌లు తెలిపారు. విలేజ్ నస్పూర్‌లో అనుమతి లేకుండా వెలిసిన వెంచర్‌లో హద్దురాళ్ళను తొలగించారు. నిబంధనలు పాటించ కుండా వెంచర్లు, అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారిం చి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్సై రవికుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మాంతయ్య, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ సతీష్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● నస్పూర్‌లో కబ్జాల జోరు...

నస్పూర్ మున్సిపాలిటీలో అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతు న్నారు. సర్వే నంబర్లు 42, 64లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. రెవెన్యూ అధికారులపై రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా విచ్చలవిడిగా ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి చేరాయి. అసైన్డ్‌దారుడిగా ఉన్న వ్యక్తులు కొందరు గతంలోనే విక్రయించి తిరిగి ఆ కాగితాలనే చూపించి మరో చోట పాగా వేస్తున్నారు. 42 సర్వే నంబరులో ఇలా ఓ వ్యక్తి తనకు ఉన్న భూమిని అమ్ముకుని మరో చోట అదే కాగితాలను ఉపయోగించి ఖాళీగా ఉన్న స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు పెట్టి అమ్మకాలు చేశారు. గత ప్రభుత్వ హయంలో కొందరు నేతలు సహకరించినందుకు రెండు గుంటల చొప్పున భూమిని గిఫ్ట్‌గా ఇచ్చినట్లు తెలిసింది. గిఫ్ట్‌గా పొందిన ఓ నాయకుడు ప్లాటును అమ్ముకోగా కొనుగోలు చేసిన వ్యక్తి ప్రహరీ నిర్మించగా అధికారులు కూల్చివేశారు. ఇటీవల ఆ ప్లాటు మళ్లీ విక్రయించినట్లు తెలుస్తోంది. సర్వే నంబరు 42లో ఎలాంటి నివాసయోగ్యమైన కట్టడాలు లేకపోయినా పిల్లపాపలతో నివాసం ఉంటున్నామని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రెవెన్యూ తరపున కోర్టులో కౌంటర్ ఫైల్ వేయకపోవడంతో కబ్జాదారుల ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కొత్తరోడ్డులో అక్రమంగా నిర్మించిన కట్టడాల ను మున్సిపల్, రెవెన్యూ అధికారుల బృందం కూల్చివేసింది. గతంలో ఈ ఏరియాలో జాతీయ రహదారి-363 నిర్మించారు. ఇండ్లు కోల్పోయిన వారికి పరిహారం, స్థలాలు ఇచ్చారు. అయితే రోడ్డుకు పోగా మిగిలిన చిన్న, చిన్న స్థలాల్లో కొందరు మళ్లీ నిర్మాణాలు చేపట్టారు. ఇవి నిబంధ నలకు విరుద్ధంగా ఉన్నాయని గుర్తించిన తహసీల్దార్ శ్రీనివాస్, మున్సి పల్ కమిషనర్ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి సతీష్ ఆధ్వర్యంలో 2 షెడ్లను కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిటౌన్, మార్చి 28: పార్లమెంట్ ఎన్ని కల నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించమని, ని బంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ తెలిపారు. గురువారం సీఈఆర్ క్లబ్‌లో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ఓటర్లను మద్యం, డబ్బుతో ప్రలోభాలు చేసినా ఉపేక్షించమన్నారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబం ధనలు పాటించాలని సూచించారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. సీఐ శశిధర్‌రెడ్డి, మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ తది తరులు పాల్గొన్నారు.

భీమారం: అర్హులైన వారందరు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఏసీపీ వెంక టేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలో సీఐ మోహన్, ఎస్ఐరాములు, జైపూర్,శ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రీధర్, సంతోష్‌లతో కలిసి ఆవడం క్రాస్‌రోడ్డు నుంచి ఫ్లాగ్‌మార్చ్ నిర్వ హించారు. ఏసీపీ మాట్లాడుతూ ఓటు సామా న్యుని వజ్రాయుధమని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని సూచిం చారు. ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు సర ఫరా కాకుండా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఏఎస్ఐ శకుంతల, భూమన్న, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

జైపూర్: పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇందారం బస్టాండ్ నుంచి గ్రా మం మీదుగా హైస్కూ ల్ వరకు కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ చేప ట్టారు. ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, భీమారం ఎస్ఐ రాములు, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, అదనపు ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రజకులు

జైపూర్, మార్చి 28: రజకుల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వివేక్ పేర్కొన్నారు. గురువారం ఇందారంలో మడేలయ్య దేవస్థానం విగ్రహ ప్రతి ష్ఠాపన కార్యక్రమంలో మా ట్లాడారు. సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను రజకులు సన్మానించారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 28: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల ఆశ్రమం లోని 30 మంది పిల్లలకు మ్యాన్ కైండ్‌ఫార్మ లిమిటెడ్ సభ్యులు గురువారం స్కూల్ బ్యాగులు, లంచ్‌బాక్స్, స్టేషనరీ కిట్‌లను అందజేశారు. రూ.30 వేల విలువ గల సామగ్రిని న్యూరో ఫిజీషియన్ తిరుమల్‌రావు చేతుల మీదుగా అందజేశారు. మధుసూదన్‌రెడ్డి, మహేందర్, సత్యపాల్‌రెడ్డి, మహేష్, సదానందం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో ఉన్నా బహుజన వాదినే

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సమావేశానికి హాజరైన ప్రజలు

కాగజ్‌నగర్, మార్చి 28: తన జీవితం బహుజనుల కోసమేనని, తాను బీఆర్ఎస్‌లో ఉన్నా కూడా బహుజనవాదిగానే ఉంటానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ సంతోష్ ఫంక్షన్ హాలులో సిర్పూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజన వాద బలోపేతం కోసం తాను బీఎస్పీ అధినాయకత్వం ఆదేశాల మేరకు బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి తీసుకొని పొత్తును విడగొట్టిందన్నారు. దీంతో తాను పార్టీకి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బహుజన, తెలంగాణ వాదాన్ని అణగదొక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంతో అభివృద్ధి జరిగినట్టు తెలిపారు. రాష్ట్రంలో 186గురుకులాలు మంజూరై నట్టు పేర్కొన్నారు. దీంతో ఎంతో మంది విద్యార్థులు భవిష్యత్తు మారిందన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత ఏర్పడిన పరిస్థితులు పూర్తిగా మారినట్టు గుర్తు చేశారు. బహుజన వాదం బలోపేతం కావాలంటే కేవలం రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించి ఓటేయాలన్నారు. తాను ద్రోహినని మాజీఎమ్మెల్యే కోనప్ప పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో తాను పొత్తులపై మాట్లాడుతుంటే ఇక్కడ ఆయన కాంగ్రెస్‌లోకి జంప్ కావటం ఎవరి ద్రోహో ప్రజలందరికీ అర్థం అవుతోందన్నారు. వారు అవినీతి, అక్రమాలు కప్పి పుచ్చుకునేందుకు పార్టీ మారినట్టు పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. రథసారథి కేసీఆర్ చేపిట్టన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏం అమలు చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై ముప్పెటదాడి చేయాలంటే కేవలం ఓటుతోనే సమాధానం చెప్పాలన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలతో మేలు జరిగినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికీ గ్యారంటీ లేదన్నారు. ఇక ఆరుగ్యారంటీలు ఏం అమలు చేస్తారని ప్రశ్నించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలు ఢిల్లీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తప్పకుండా ఆదరించాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లోకి ప్రస్తుతం పులులు వస్తున్నాయని, ఇక్కడున్న మేకలు మాత్రం ఇతర పార్టీలోకి పోయినట్టు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. నాయకులు పోయినా కూడా కార్యకర్తలుంటున్నారంటే కేవలం తాము చేపట్టిన సంక్షేమ పథకాల వల్లే అని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ కూడా చేపట్టలేదన్నారు. తప్పకుండా ఆదరించి బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, మాజీకౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీలోని నాయకులు పలువురు బీఆర్ఎస్‌లోకి చేరటంతో ఆర్ఎస్ ప్రవీణ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లోకి చేరిన తర్వాత తొలిసారిగా కాగజ్‌నగర్‌కు రావటంతో నాయకులు, కార్యకర్తలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గజమాలతో సత్కరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లెండుగురే శ్యాంరావు, శరత్ ముదిరాజ్, సీపీ రాజ్‌కుమార్, జడ్పీటీసీ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), మార్చి 28: వేంపల్లి రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గురువారం వేంపల్లి రైల్వేగేటు వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సికింద్రాబాద్ రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరగా ఆర్ఓబీ పనులు పూర్తి చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు నుంచి రీ కన్‌స్ట్రక్షన్ బీటీరోడ్డు మంజూరు అయిందని టెండర్లు పూర్తైతే పనులు ప్రారంభమవు తాయన్నారు. ఆయనవెంట నాయకులు శ్రీనివాస్, రైల్వే అధికారులున్నారు.

జాతీయ యోగా పోటీలకు పీఈటీ యోగి



జాతీయ యోగా పోటీలకు ఎంపికైన యోగి

రెబ్బెన, మార్చి 28: తమిళనాడులో జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు ఫాతిమా కాన్వెంటు పాఠశాల పీఈటీ యోగి ఎంపికైనట్టు తెలంగాణ యోగాసన్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి అంజనేయులు గౌడ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి, జాతీయ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి



ప్రభాకర్(ఫైల్)

వాంకిడి, మార్చి 28: మండలకేంద్రానికి చెందిన జంబోజు ప్రభాకర్(66) బుధవారం రాత్రి వ్యాన్ ఢీకొని మృతిచెందినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్ కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తు న్నాడు. బుధవారం సాయంత్రం పనులు ముగించుకొని లక్ష్మీనగర్ నుంచి రాత్రి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో వ్యాన్ వెనకనుంచి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా డ్రైవర్ మహమ్మద్ సర్దార్ వ్యాన్‌లో పశువులను తరలిస్తుండడంతో పశువులను గోశాలకు తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

డీఎస్పీని సన్మానించిన ఆర్టీసీ డీఎం



డీఎస్పీని సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్, మార్చి 28: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనే జర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన విశ్వనాథ్ గురువారం డీఎస్పీ సదయ్యను మర్యాద పూర్వ కంగా కలిసి సన్మానించారు. అనంతరం డిపో ఆవరణలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని డీఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం సమస్యలను పరిష్కరిస్తామని డీఎస్పీ అన్నారు. ఆయన వెంట ఏఎంఎఫ్ ఉదయ్ ఉన్నారు.

రూ.1,31,000 పట్టివేత

జైనూర్, మార్చి 28: ఎన్నికల కోడ్‌నేపథ్యంలో పోలీసులు జంగాం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొప్పురాజయ్య అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,31,000నగదు స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించామని జైనూర్ ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

● సినీ నటుడు సుమన్



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న సుమన్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 28: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని సినీనటుడు సుమన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో వెలుగు ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న మైనార్టీలకు తోఫాలను సుమన్ చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందని, కులమతాలకు అతీతంగా జరిగే ఇఫ్తార్ విందులు స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. సుమన్‌ను ముస్లిం పెద్దలు, వెలుగుఫౌండేషన్ చైర్మన్ మడుపు రాంప్రకాష్, అరుణలు సన్మానించారు. అబ్దుల్‌రహీం, సలీం అక్తర్, మంచిర్యాల ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు అయేషాజబీన్, శ్రీధర్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: సినీ నటుడు సుమన్‌ను అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ సన్మానించారు.

ఘనంగా సంకటహర చతుర్థి

నస్పూర్, మార్చి 28 : నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీలక్ష్మి గణపతి దేవాలయంలో గురువారం సంకట హర చతుర్థి సందర్భంగా స్వామి వారికి మహా హరిద్రాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి మహా హరిద్రాభిషేకం (పసుపు)తో అభిషేకం, పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

కాసిపేట, మార్చి 28: దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ శివారులో ఉన్న 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు ఎస్ఐ అంజనేయులు తెలిపారు. రెండురోజుల క్రితం వెంకటాపూర్ శివారు ప్రాంతంలో 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించి అటవీ ప్రాంతంలో పగులగొట్టి అందులోని 20 కిలోల అల్యూమినియం వైరును దుండగలు ఎత్తుకెళ్లారన్నారు. ఏఈ స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 29 మార్చి 2024



ట్రైనీ బీట్ అధికారుల పర్యటన

జన్నారం, మార్చి 28 : హైద్రాబాద్‌లోని దూలపల్లి అటవీ కళాశాలకు చెందిన 49 మంది బీట్ అధికారులు గురువారం కవ్వాల టైగర్ జోన్‌లోని ఇందన్‌పల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా అటవీ, వన్య ప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలు, కల్పిస్తున్న నీరు, ఆహారం సదుపాయాల గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో హఫదీజుద్దీన్ , సిబ్బంది పాల్గొన్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:30
శుక్రవారం
సహర్ | 4:50
శనివారం

భూ కబ్జాలపై ప్రత్యేక సర్వే

- సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారుల క్షేత్ర పరిశీలన
- కబ్జాలపై ఆంధ్రజ్యోతి కథనంతో కదలిన యంత్రాంగం
- అధికారుల నివేదికపైనే భూముల భవిష్యత్తు



గతంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం (ఫైల్)



వివరాలు వెల్లడిస్తున్న జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి (కుడివైపు ఉన్న వ్యక్తి)

మంచిర్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఖరీదైన స్థలంపై ఎట్టకేలకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు దృష్టి సారించారు. హైద్రాబాద్‌లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి నేతృత్వంలో అధికారులు గురువారం ఆర్టీసీ డిపో వెనుక ఉన్న సర్వే నెంబర్లు మంచిర్యాల శివారులోని 422, గర్మిళ్ల శివారులోని 92, 93 గల 13.38 ఎకరాల పై చిలుకు ప్రభుత్వ భూమిలో సర్వే జరిపారు. కొంత కాలంగా ఈ స్థలం విషయమై తీవ్ర వివాదం నెలకొంది. అది ప్రభుత్వ భూమి కాగా, కొందరు అక్రమంగా కబ్జా చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఫిర్యాదులు అందుకున్న రెవెన్యూ అధికారులు పలుమార్లు సర్వేలు జరిపినప్పటికీ అది పట్టా భూమో, ప్రభుత్వ స్థలమో నిర్ధారించక పోవడంతో వివాదం ముదురుతోంది.

కలెక్టర్‌కు ఫిర్యాదుతో

మంచిర్యాల శివారు సర్వే నెంబరు 422లో ప్రభుత్వ భూములు పెద్ద మొత్తంలో కబ్జా లకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని పట్టణానికి చెందిన తులా మధుసూదన్‌రావు అనే వ్యక్తి పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మంచిర్యాల ఆర్డీవో ఇచ్చిన నివేదిక ఆధారంగా మున్సిపల్ అధి కారులు నిర్మాణ అనుమతులు ఇచ్చారని, ఆర్డీవో నివేదికలో దొర్లిన సాంకేతిక లోపాలను గమనించ నించకుండానే అనుమతులు మంజూరు చేశారని, కలెక్టర్ స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై 'జిల్లా కేంద్రంలో భూకబ్జా' శీర్షికన 2023 జూలై 18న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి ఎట్టకేలకు సర్వే చేపట్టారు.

సర్వేపైనే భూముల భవిష్యత్తు?

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు జరిపిన సర్వే నివేదికపైనే భూముల భవిష్యత్తు ఆధారపడి ఉంది. భూమి సర్వే జరిపిన జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. అయితే అధికారులు నిష్పక్షపాతంగా నివేదిక తయారు చేస్తేనే ఇంతకాలం ప్రజలు చేసిన పోరాటానికి ఫలితం దక్కే అవకాశాలున్నట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా స్థానిక ల్యాండ్ సర్వే అధికారులు గతంలో సర్వే జరిపినా వారిపై విశ్వాసం లేకనే కలెక్టర్ ద్వారా హెడ్ ఆఫీస్‌కు ఫిర్యాదు చేశారు. తాజాగా గురువారం చేపట్టిన సర్వేలో రాష్ట్ర అధికారులతోపాటు స్థానిక యంత్రాం గం పాల్గొనడంపై ప్రజల నుంచి పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హైద్రాబాద్ నుంచి వచ్చిన వారిలో జాయింట్ డైరెక్టర్‌తోపాటు అక్కడి సర్వేయర్ సంధ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, తహసీల్దార్ రమేష్, ఆర్ఐ అజీజ్‌తోపాటు స్థానిక సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, ఆర్ఐ గంగాధర్ పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ డైరెక్టర్, అధికారులు

బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మనోహర్



బెల్లంపల్లి, మార్చి 28: బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిప్ప మనోహర్ ఎన్నికయ్యారు. గురువారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి చిప్ప మనోహర్‌తోపాటు చేను రవి కుమార్ పోటీలో ఉండగా ప్రత్యర్థిపై 5 ఓట్ల తేడాతో చిప్ప మనోహర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షు డిగా కనుకుంట్ల రాజేష్, కోశాధికారిగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా సింగతి రాజేష్‌లు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రెటరీగా దాసారపు రాజు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా ఎండీ జుబేర్, కుమార్‌లు ఎన్నికయ్యారు.

మంచిర్యాల అధ్యక్షుడిగా జగన్

ఏసీసీ, మార్చి 28: మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బండవరం జగన్ ఎన్నికయ్యారు. గురువారం మంచిర్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా కట్కూరి గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.మురళీ కృష్ణ, జాయింట్ సెక్రెటరీగా ఎం. కనకయ్య, ట్రెజరర్‌గా అల్లం శ్రీనివాస్, లైబ్రరీ సెక్రెటరీగా సాగె గురువయ్య, కోర్టు, కల్చరల్ సెక్రెటరీగా సంతోష్‌కుమార్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దుర్గం రమేష్, ఉమా రాణి, మహిళ ప్రతినిధిగా రాధికలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని సభ్యులు అభినందించారు.

మెడికల్ షాపుల తనిఖీ



తనిఖీలు చేస్తున్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మెడకల్ షాపులను గురువారం కరీంనగర్ డీసీఏ శ్రీనివాసులు, మంచిర్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన తనిఖీలు నిర్వహించారు. మందులను పరిశీలించారు. నిబంధనల మేరకు మెడికల్ షాపులు నిర్వహించాలని, వైద్యుల ప్రిస్కిప్షన్ ఆధారంగా మందులను అందించాలని సూచించారు. నిబంధనలను పాటించకపోతే షాపులను సీజ్ చేస్తామన్నారు.

వాహనాల కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారు



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

బెల్లంపల్లి, మార్చి 28: మున్సిపాలిటీలో ఇటీవల కొనుగోలు చేసిన వాహనాల కొనుగోలులో అధికారులు, కొంత మంది పాలకవర్గం కలిసి అక్రమాలకు పాల్పడ్డారని కౌన్సిలర్లు ఆరోపించారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ రూ.37 లక్షల వ్యయంతో పాత ఎక్స్‌కావేటర్‌ను కొనుగోలు చేసి కొత్తది కొనుగోలు చేసినట్లు చూపి నిధులు కాజేశారన్నారు. ఎక్స్‌కావేటర్‌ను షెడ్డుకే పరిమితం చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా ఇష్టం వచ్చినట్లు కమీషన్ల కోసం వాహనాలు కొనుగోలు చేసి ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. కౌన్సిలర్లు జిలకర వాసు, మూర్తి, ఎలిగేటి శ్రీనివాస్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హాజీపూర్, మార్చి 28 : మండలంలోని కర్ణమామిడి గ్రామ శివారులో గురువారం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3660 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి



మంచిర్యాలలో 5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్, బెల్లంపల్లిలో పాల్గొన్న ఆర్డీవో, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు చేపట్టిన 5కే రన్ ర్యాలీని అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ మాటాడుతూ దేశంలోని ప్రతీ పౌరునికి సమాన విలువ కలిగిన ఓటు హక్కును రాజ్యాంగం మనకు కల్పించిందని, ఎన్నికల్లో వయస్సు అర్హత, ఓటరు జాబితాలో పేరు గల ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు కళాజాత, ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన వారందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఏప్రిల్ 15లోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. అధికారులు, యువతీ యువకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. తిలక్ స్టేడియం నుంచి బజార్ ఏరియా మీదుగా ఏఎంసీ క్రీడా మైదానం వరకు 5కేరన్ నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల్లో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం తీసుకురావడానికి కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అర్హులైన వారందరు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు ద్వారా సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవచ్చన్నారు. ఒత్తిడి, ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు.

చెన్నూరు: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ కోరారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా 5కే రన్‌ను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన అందరు బాధ్యతాయుతంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెమొంటోలు అందజేత



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డీఈవో యాదయ్య

ఏసీసీ, మార్చి 28: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఈవో యాదయ్య గురువారం జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మెమొంటో, ప్రశంసాపత్రాలను అందించారు. జనవరి 18, 19 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చిన 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించగా 10 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రెండు పోటీల్లో జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు అందించారు. డీఈవో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. డీఈవో మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ పోటీల్లో విజేతలుగా పొట్టపల్లి నరేష్, మైదం స్ఫూర్తి, విజయ్, షేక్ సాధిక్, కొమ్మెర శ్రీవత్స హర్షిత, శ్యామల, సుష్మిత, రవళి, ప్రశాంత్‌లు మొదటి పది స్థానాల్లో నిలిచారు. జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో మాణిక్‌రావు, శ్రీనిత, నిషిశ్రీ, వైష్ణవి, గంగారాం, జగదీశ్వర్, సందీప్, ప్రమీల్‌కుమార్, శాంత్‌రాజ్, సాయిసుశాంత్‌లు మొదటి పది స్థానాల్లో నిలిచారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, కుమారస్వామి, పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత

జన్నారం, మార్చి 28 : మంచిర్యాలలోని శ్రీసాయి అనాథ వృద్ధ ఆశ్రమానికి మండలంలోని కలమ డుగు వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థు లు విరాళాల ద్వారా సేకరించిన రూ.7335 నగ దును గురువారం ఆశ్రమ ప్రతినిధి వాసుకు అంద జేశారు. ప్రిన్సిపాల్ సతీష్‌గౌడ్, ఇన్‌చార్జి తిరుపతిలు విద్యార్థులను అభినందించారు.

నగదు పట్టివేత

కాసిపేట, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమగూడెం చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.81 వేల నగదును పట్టుకున్నట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ నుంచి వస్తున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా రియాజ్ వద్ద రూ. 81 వేల నగదు దొరికిందన్నారు. ఈ నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐకి సన్మానం

జైపూర్, మార్చి 28 : జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో నుంచి బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ ఇజాజ్‌ను గురువారం ఎస్ఐ శ్రీధర్, అదనపు ఎస్ఐ నాగరాజులు సన్మానించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమని పేర్కొన్నారు. ఎక్కడ ఉన్న మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఏఎస్ఐ హబీబ్, కానిస్టేబుళ్లు రాజేందర్, రాంచందర్, సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వేమనపల్లి, మార్చి 28: వేమనపల్లిలో గురువారం నీల్వాయి ఎస్ఐ శ్యాంపటేల్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎవరైనా వాహనాల్లో నగదు, మద్యం తరలిస్తే చర్యలు తీసుకొంటామన్నారు.

ఘనంగా అంజనీపుత్ర సంస్థ చైర్మన్ జన్మదినం



కేక్ కట్ చేస్తున్న అంజనీపుత్ర చైర్మన్ గుర్రాల శ్రీధర్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 28: అంజనిపుత్ర సంస్థ వ్యవస్థాపక చైర్మన్, ఫౌండర్ గుర్రాల శ్రీధర్ జన్మదిన వేడుకలు గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. శ్రీధర్ కేక్ కట్ చేశారు. శ్రీధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అంజనిపుత్ర, రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో 3 వేల మందితో రక్తదాన శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, పలువురు అతిథులు మాట్లాడుతూ యువత ఎంచుకున్న రంగంలో రాణించాలంటే స్వయం కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో గుర్రాల శ్రీధర్ రాణించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. శ్రీధర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంజనీపుత్ర సామాజిక సేవ ట్రస్టు లోగోను ఆవిష్కరించారు. సంస్థ డైరెక్టర్‌లు సంతోష్, కిషన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా ప్రచార కార్యదర్శిగా విజయ భాస్కర్

హాజీపూర్, మార్చి 28: జాతీయ మాలమహానాడు జిల్లా ప్రచార కార్యదర్శిగా మండలంలోని గుడిపేట ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన విజయ భాస్కర్‌ను నియమించారు. గురువారం మంచిర్యాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, ప్రచార కార్యదర్శి కనరాజులు విజయభాస్కర్‌కు నియామక పత్రాన్ని అందించారు.

పది పరీక్షలో 22 మంది గైర్హాజరు

ఏసీసీ, మార్చి 28: పదో తరగతి పరీక్షలో గురువారం మంచిర్యాల జిల్లాలో 22 మంది గైర్హజరయ్యారు. జీవశాస్త్ర పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 9298 మందికి 9276 మంది హాజరయ్యారు. బ్యాక్‌లాగ్ విద్యార్థులు 144 మందికి 129 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 9442 మందికిగాను 9405 మంది పరీక్షకు హాజరయ్యారు. హాజరైన వారు 99.61 శాతం. స్టేట్ అబ్జర్వర్ ఉషా రాణి జిల్లా కేంద్రంలోని 4 పరీక్ష కేంద్రాలను, డీఈవో యాదయ్య 3, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ 1 పరీక్ష కేంద్రాన్ని, ప్లైయింగ్ స్క్వాడ్ 13 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ప్రసాద్



నియామక పత్రం అందిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు

హాజీపూర్, మార్చి 28: హాజీపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దొనబండ గ్రామానికి చెందిన రేవెళ్ల ప్రసాద్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు గురువారం డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నల్ల మహేష్‌లు ప్రసాద్‌కు నియామకపత్రం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, దొనబండ గ్రామ అధ్యక్షుడు సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా అశ్విన్‌రెడ్డి



ఏసీసీ, మార్చి 28: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షు డిగా బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం జిల్లా కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అశ్విన్‌రెడ్డికి నియామక పత్రం అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేస్తానన్నారు.

ఎంపీఎల్ క్రికెట్ లీగ్ బ్రోచర్ల విడుదల



క్రికెట్ లీగ్ బ్రోచర్ల విడుదల

ఏసీసీ, మార్చి 28: మంచిర్యాల క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ బ్రోచర్లను గురువారం పాత మంచిర్యాలలోని క్రికెట్ మైదానంలో ఓఎంఎస్‌సీ అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్ ఆవిష్కరించారు. కిషన్, గురు అకాడమీ ఆర్గనైజర్ దుర్గాప్రసాద్‌లు మాట్లాడుతూ ఈ నెల 31లోగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల జట్ల వేలం ఉంటుందని ఆసక్తి గల వారు రూ.300 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఫ్రాంచైజ్ ఓనర్లు రూ.15 వేలు చెల్లించి జట్టును ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని, ఏప్రిల్ 14 నుంచి టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు గురు అకాడమీలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఓల్డ్ మంచిర్యాల స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు ఎర్రం ప్రభాకర్,తూముల ప్రభాకర్, ఎల్ల మల్లేష్, విజయ్ పాల్గొన్నారు.

మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా రామస్వామి



నస్పూర్, మార్చి 28: నస్పూర్ పట్టణం అంబేద్కర్ కాలనీకి చెందిన గరిసె రామస్వామిని తెలంగాణ మాల మహానాడు మంచిర్యాల నియోజకవర్గం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గురువారం నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మన్, జైభీం సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాధి పురుషోత్తం, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పలిగిరి కనక రాజులు అందజేశారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని రామస్వామి అన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మందమర్రిటౌన్, మార్చి 28: పట్టణంలోని రెండో జోన్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ఆయా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పెళ్లి పెద్దలుగా కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు కుసుమకుమార్ భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.